సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 13 । మార్చి । 2023



నిండు గర్భిణికి కష్టాలు

రహదారి లేని గ్రామంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. 8లో



పోటెత్తిన పర్యాటకులు

మండలంలోని పోచవరం బోట్‌పాయింట్ నుంచి ఐదు బోట్లలో 270 మంది పాపికొండలు విహారానికి వెళ్లారు. 8లో



తాటాకిల్లు దగ్ధం 8లో

రాజవొమ్మంగి మండలం బడదనాంపల్లి పంచాయతీ, కొత్తవీధిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది.

ఎమ్మెల్సీ ఎన్నికల సమరం నేడే

- ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,59,936 మంది ఓటర్లు
- అప్పర్ సీలేరు కేంద్రంలో 56 మంది మాత్రమే..
- పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్



పాడేరులో బ్యాలెట్ బాక్స్‌లతో ఎన్నికల విధులకు బయలుదేరిన పోలింగ్ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: పట్టభద్రుల ఎన్నికల సమరం సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని గ్రాడ్యుయేట్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనున్నారు. ప్రాధాన్య క్రమంలో బ్యాలెట్‌పై జరిగే పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందితో సామగ్రిని తరలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా **144 సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు డ్రైడే అమల్లో ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్‌లోకి వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు** అనుమతించనున్నారు. 4 గంటల తర్వాత వరసలో ఉన్న వారిని వీడియో తీసి టోకెన్లు అందిస్తారు.

బరిలో 37 మంది అభ్యర్థులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి సంబంధించి 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, బీజేపీ నుంచి మాధవ్, టీడీపీ నుంచి చిరంజీవిరావు, పీడీఎఫ్ తరఫున రమాప్రభ బరిలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఈ ఎన్నికల్లో తమ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌దే విజయమని వైఎస్సార్ సీపీ ధీమాగా ఉంది. ఓటమి తప్పదని తెలిసి వైఎస్సార్ సీపీ విజయావకాశాలు దెబ్బతీసేందుకు టీడీపీ, పీడీఎఫ్ అడ్డదారులను తొక్కుతూ.. కలిసి కుయుక్తులు పన్నుతున్నాయి. మరో వైపు తమకు జనసేన మద్దతు ఉంటుందని భావించిన బీజేపీ.. ఆ ఛాయలేవీ కనిపించకపోవడంతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇలా ఎవరికివారు గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు.

ఉమ్మడి విశాఖలో..

ఉమ్మడి విశాఖలో 176 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతోంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2,89,214 ఓటర్లుండగా..అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11,525, విశాఖపట్నం జిల్లాలో 1,05,697, అనకాపల్లి జిల్లాలో 42,714 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే దాదాపు 98 శాతం మందికి ఎన్నికల సంఘం తరఫున ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 1,59,936 మంది ఓటర్లున్నారు. విశాఖలో 358, అనకాపల్లిలో 160, అల్లూరి జిల్లాలో 18 బ్యాలెట్ బాక్సులు చొప్పున మొత్తం 536 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నారు. విశాఖ జిల్లాలో 1,09,400 బ్యాలెట్ పేపర్లు, అనకాపల్లిలో 44,200, అల్లూరిలో 12 వేలు చొప్పున మొత్తం ఉమ్మడి విశాఖలో 1,65,600 బ్యాలెట్ పేపర్లను ఆయా పోలింగ్ స్టేషన్లకు పంపించారు.

1055 మందితో విధులు

ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 1,055 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. విశాఖ జిల్లాలో 657 మంది, అనకాపల్లి పరిధిలో 304, అల్లూరి జిల్లాలో 94 మంది ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమ సామగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు.విశాఖ జిల్లాలో 112, అనకాపల్లిలో 49, అల్లూరి జిల్లాలో 15 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పటిష్టంగా భద్రత

ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. విశాఖ జిల్లా పరిధిలో 1,142, అనకాపల్లి జిల్లాలో 691, అల్లూరి జిల్లాలో 230 మంది పోలీసులను ఎన్నికల విధులను అప్పగించారు. అల్లూరి జిల్లా పరిధిలో 15 సున్నితమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి.. ఈ ప్రాంతాల్లో అదనంగా 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, ఏపీఎస్‌పీ బృందాలు, 10 పార్టీల నడుమ భద్రత ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

సీలేరు పోలింగ్‌స్టేషన్‌లో అత్యల్పంగా...

పోలింగ్ స్టేషన్లను ఓటర్లకు అనువుగా ఏర్పాటు చేశారు. దీని ప్రకారం ఒక్కో జిల్లాలో అత్యధిక ఓటర్లు, అత్యల్ప ఓటర్లున్న పోలింగ్ బూత్‌లను గుర్తించారు. అల్లూరి జిల్లా పరిధి అప్పర్ సీలేరు ప్రాంతంలోని జెడ్పీ హైస్కూల్ బ్లాక్ నం.1లో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో అత్యల్పంగా 56 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. పెదబయలులోని జెడ్పీ హైస్కూల్ 7వ తరగతి రూమ్‌లోని బూత్‌లో 1,191 మంది అత్యధికంగా ఓటర్లున్నారు.



పాడేరులో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఆర్టీసీ బస్సులో ఎన్నికల సామగ్రితో బయలుదేరిన పోలింగ్ అధికారులు



పాడేరులోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

ఉమ్మడి విశాఖ జిల్లాలో పోలింగ్ వివరాలు

బరిలో అభ్యర్థులు	:	37 మంది
పోలింగ్ సమయం	:	ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
పోలింగ్ బూత్‌లు	:	176
ఓటర్లు	:	1,59,936
బ్యాలెట్ బాక్సులు	:	536
బ్యాలెట్ పేపర్లు	:	1,65,600
ఎన్నికల సిబ్బంది	:	1055
భద్రతా సిబ్బంది	:	2063 మంది

ప్రశాంతంగా పోలింగ్‌కు చర్యలు

ఎస్పీ సతీష్‌కుమార్



సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామని వివరించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 15పోలింగ్ కేంద్రాలలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నామని చెప్పారు. అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 13మంది ఎస్‌ఐలు, 48 మంది ఏఎస్‌ఐలు,హెచ్‌సీలు, 85మంది కానిస్టేబుళ్లు, 15మంది మహిళా కానిస్టేబుళ్లు, ఏఆర్ నుంచి 75మంది, ఏపీఎస్పీ నుంచి 56మంది సిబ్బందిని ఎన్నికల విధులకు నియమించినట్టు చెప్పారు. మరో 200 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిని కూడా కేటాయించామని ఆయన పేర్కొన్నారు.

11 మండలాల్లో 15 పోలింగ్ కేంద్రాలు..

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని 11మండలాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.ఆదివారం ఉదయం ఏడు గంటలకే ఎన్నికల అధికారులు తలారిసింగి చేరుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో పోలింగ్ అధికారులు, ఏపీవోలు, ఇతర సిబ్బందికి బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు, ఇతర మెటీరియల్ పంపిణీ చేశారు.

- ప్రతీ బ్యాలెట్ బాక్స్‌ను కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు అభిషేక్, శుభం బన్సాల్ పరిశీలించారు. తరువాతనే ఎన్నికల పోలింగ్ అధికారులకు పంపిణీ చేశారు.
- పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌డీసీ శర్మ, డీఆర్వో అంబేద్కర్, పలువురు తహసీల్దార్లు కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పర్యవేక్షించారు.
- ఉదయం 11గంటలకు 10 ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక అధికారులు, రూట్ అధికారులు, భద్రతా సిబ్బంది 10 ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీస్థాయిలో బందోబస్తును పోలీసుశాఖ ఏర్పాటు చేసింది.

పురుషులు 7,861, మహిళలు 3,661..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాడేరు డివిజన్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో 11,525 మంది పట్టభద్రులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 7,861, మహిళలు 3,661, ఇతరులు ముగ్గురు ఉన్నారు.

కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు..

ముంచంగిపుట్టు పోలింగ్ కేంద్రం 146లో 1,059 మంది, పెదబయలు (147)లో 1186, హుకుంపేట (148)లో 900,హుకుంపేట (148ఏ)లో 814, డుంబ్రిగుడ (151)లో 912, అరకులోయ (149)లో 945, అరకులోయ (150)లో 874, అనంతగిరి (152)లో 633, పాడేరు (153)లో 780, పాడేరు (154)లో 660, జి.మాడుగుల (155)లో 637, చింతపల్లి (161)లో 1021, జీకేవీధి (162)లో 384, సీలేరు (163)లో 56, కొయ్యూరు పోలింగ్ కేంద్రం 164లో 664 మంది ఓటర్లు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

పోలింగ్ స్టేషన్ జేసీ పరిశీలన

డుంబ్రిగుడ: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పరిశీలించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్‌ను ఆదేశించారు.



పాడేరు డివిజన్‌లో ఎన్నికల విధులకు ఆర్టీసీ బస్సులు

న్యూస్‌రీల్

హాల్ టికెట్ ఇవ్వకుంటే కఠిన చర్యలు

విశాఖ విద్య: ఫీజు బకాయి ఉందనే నెపంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే.. అలాంటి కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం హెచ్చరించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫీజుల వసూళ్ల పేరుతో కొన్ని కాలేజీ యాజమాన్యాల విద్యార్థులను వేధిస్తున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 18004257635కు లేదా apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పంపింగ్ స్టోరేజీ ప్రాజెక్ట్ స్థల పరిశీలన



ఇసుకకోరి ప్రాంతాన్ని సందర్శించిన డైరెక్టర్ సత్యనారాయణ, అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో నిర్మించబోయే పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ప్రదేశాలను ఆదివారం జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. తొమ్మిది యూనిట్లతో 1300 మెగావాట్ల ప్రాజెక్టుకు నిర్మించే పార్వతీనగరం, నీరు మళ్లించే ఇసుకకోరి, డీఆర్పీ క్యాంపు బూసుకొండ గ్రామాలను పరిశీలించారు. ప్రాజెక్ట్ మ్యాప్‌ను పరిశీలించిన ఆయన ఇంజనీర్లు, అధికారులకు సూచనలు చేశారు. వేసవిలో విద్యుత్ ఉత్పత్తి సరఫరాకు ఇబ్బంది లేకుండా మెరుగుపడేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీరు శ్రీధర్, బాలకృష్ణ, బాబురావు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, సురేష్ ఉన్నారు.

17 నుంచి గడి బాపనమ్మ జాతర



రంపచోడవరం: గిరిజనుల ఇలవేల్పు సీతపల్లి గడి బాపనమ్మ అమ్మవారి జాతర ఈ నెల 17 నుంచి 21 వరకు జరుగుతుందని ఆలయ ఈవో గండిపూడి సత్యరమేష్ తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జాతర ప్రారంభం రోజు ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి మహాకుంభం జరుగుతుందన్నారు. సీతపల్లి గ్రామ ప్రజలు అమ్మవారికి సారె సమర్పణ, అమ్మవారికి ఉయ్యాల సేవా కార్యక్రమం, మహాచండీ హోమం, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రెండో రోజు అమ్మవారికి విశేష పూజ, సాముహిక కుంకుమ పూజలు జరుగుతాయి. చివరి రోజు ఉగాది పర్వదినం పురస్కరించుకుని మహాకుంభం కార్యక్రమం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోలీసుల ఔదార్యం



నూకాలమ్మను పరామర్శిస్తున్న ఎస్‌ఐ తదితరులు

రాజవొమ్మంగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న స్వీపర్ దెబ్బతగిలి కన్ను పోగొట్టుకోవడంతో ఆమెకు ఎస్‌ఐ గోపీనరేంద్రప్రసాద్, సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. గ్రామానికి చెందిన గూటాల నూకాలమ్మ స్టేషన్లో దాదాపు 12 ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తోంది. ఇంట్లో వంట పనులు చేస్తుండగా ఆమె కుడి కంటికి గాయమైంది. పరీక్షించిన కంటి వైద్యనిపుణులు వెంటనే ఆమెకు ఆపరేషన్ చేయాలని సిఫార్సు చేశారు. అప్పటికే ఆమెకు ఎడమ కన్ను లేదు. పూర్తిగా అంధురాలైన నూకాలమ్మకు వెంటనే ఆపరేషన్ చేయించేందుకు ఎస్‌ఐ, సిబ్బంది రూ.16 వేలు సమకూర్చారు. ఆమెను చికిత్సకు తరలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నూకాంబిక వెండి ఆభరణాలు ఊరేగింపు | -8లో

వైఎస్ ఆశయసాధన లక్ష్యంగా పాలన

- వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: మహానేత వైఎస్ మరణానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పెద్దదిక్కు కోల్పోయిందని.. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ప్రజల కోసం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని ఆపార్టీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి చొక్కాకుల, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికి తినిపించారు. అనంతరం చొక్కాకుల మాట్లాడుతూ పాదయాత్రతో అన్ని వర్గాల ప్రజల కష్టాలను తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే 99శాతం హామీలను నెరవేర్చిన నేతగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమైందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ ఖాయమన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్రంలో ప్రజలకు మంచి చేస్తున్న సీఎంకు రుణపడి ఉంటామన్నారు. ఎంపీపీ సోనారి రత్నకుమారి, వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి,మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బసవన్నదొర, సచివాలయాల మండల కన్వీనర్ కోటేశ్వరరావు,మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కోడా సుశీల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు.మార్కెట్ క మిటీ డైరెక్టర్లు, మండల పార్టీ,యువజన, మహిళా విభాగం నేతలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలుచేసినా ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాలను తమ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, డుంబ్రిగుడ జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీలు ఉషారాణి, శెట్టి నీలవేణి, ఈశ్వరి, రాజాబాబు, వైస్ ఎంపీపీలు ఆనంద్, రామన్న, మండల పార్టీ అధ్యక్షులు గాసి, శెట్టి ఆనంద్, కొండబాబు, కన్వీనర్లు పట్టాసి సంపత్‌కుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: నిరంతరం ప్రజల్లో ఉన్న నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పాలన అందిస్తున్నారన్నారు. అధికారాన్ని బాధ్యతగా భావించి పాలిస్తున్న వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్ మంగా బొజ్జయ్య, వడల ప్రసాద్, ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లుదొర, కుంజం వంశీ, ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు,పార్టీ నాయకులు బొబ్బా శేఖర్, నందూరి రాంబాబు, పాలోజు కాంతం, మంగా తమన్నకుమార్, కొండ్రరాజు, శారపు అప్పారావు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



అరకులో పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రంపచోడవరంలో పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రమాదాల నివారణలో 'మేఘా'కు అభినందన

ప్రశంసా పత్రాన్ని అందజేసిన ఏపీ జెన్‌కో



ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కోటేశ్వరరావు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మేఘా సంస్థ జీఎం శంకర్ తదితరులు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు జల విద్యుత్‌కేంద్ర నిర్మాణంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా భద్రతా ప్రమాణాలు పాటించిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ ఏపీ జెన్‌కో నుంచి అభినందన పత్రం అందుకుంది. జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా పోలవరం జల విద్యుత్ కేంద్ర ఆవరణలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కోటేశ్వరరావు మేఘా ఇంజినీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ పి.శంకర్, భద్రతా విభాగం ఇన్‌చార్జి సవ్యసాచి రాణాలకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఐదు లక్షల సేఫ్‌మ్యాన్ అవర్స్ సాధించినందుకు గాను ఈ ప్రశంసా పత్రాన్ని అందజేసినట్టు వారు తెలిపారు. 2021 జూన్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి ఆఖరు వరకూ ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా మేఘా సిబ్బంది విధులు నిర్వహించడాన్ని ఎస్‌ఈ కోటేశ్వరరావు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత అనేది నినాదం మాత్రమే కాదు అది ఒక జీవన విధానం అన్నారు. ఈ ఏడాది వృత్తిపరమైన ప్రమాదాల నివారణ అభివృద్ధి చెందుతున్న సవాళ్లు మరియు అవకాశాలు నినాదంతో జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



ఘటాలు, సారె ఊరేగింపు, (ఇన్‌సెట్) అమ్మవారు

రావికమతం: మండలంలోని కొత్తకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. 10,11,12 తేదీల్లో నిర్వహించిన వారికోత్సవంలో భాగంగా ఆఖరి రోజు ఆదివారం భారీ ఎత్తున ఘటాలు, సారె ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో వేలాదిగా మహిళలు, గ్రామస్తులు తరలివచ్చారు. రోడ్లు కిక్కిరిసిపోయాయి.భారీ అన్నసమారాధన జరిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్

సీలేరు: సీలేరు పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధిగా అమలుచ చేయాలని ఎస్ఐ రామకృష్ణను నోడల్ అధికారి, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. అదివారం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బందితో కలిసి ఆయన సీలేరు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.

పోటెత్తిన పర్యాటకులు

ఐదు బోట్లలో 270 మంది విహారం

వీఆర్‌పురం: మండలంలోని పోచవరం బోట్ పాయింట్ నుంచి ఐదు బోట్లలో 270 మంది పర్యాటకులు ఆదివారం పాపికొండలు విహారానికి వెళ్లారని ఏపీ టూరిజం ఇన్‌చార్జి మేనేజర్ సీహెచ్ రాజేష్ తెలిపారు. గత రెండు వారాల నుంచి పాపికొండలకు పర్యాటకుల తాకిడి తగ్గింది. ఈ నేపథ్యంలో భారీగా తరలిరావడంతో పోచవరం బోట్ పాయింట్, పేరంటపల్లి శివాలయం, కొల్లూరు హట్స్ కళకళలాడాయి.

నూకాంబిక వెండి ఆభరణాలు ఊరేగింపు



అమ్మవారి వెండి పాదాలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో నూకాంబిక అమ్మవారి మాలాధారణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గురుమాత శీలం దేముళ్ల పర్యవేక్షణలో 15 మంది భక్తులు మాలాధారణ చేశారు. కొత్త అమావాస్య వరకు వీరు దీక్షలో ఉంటారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు సహకారంతో తయారు చేయించిన వెండి ఆభరణాలు కిరీటం, వడ్డాణం, పాదాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి అలంకరించారు.

సాగరంలో సీ–వీడ్ సాగు!

- ఇందుకు విశాఖ తీరం అనుకూలం
- మత్స్యకార, డ్వాక్రా మహిళలకు అవకాశం
- విశాఖ, అనకాపల్లి జిల్లాకు 2,700 యూనిట్లు మంజూరు
- సీవీడ్‌లో అత్యధిక ఔషధ గుణాలు
- రాష్ట్రంలో తొలిసారిగా దీని సాగుకు మత్స్యశాఖ సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం: ఎన్నో పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలు కలిగిన సీ–వీడ్ (మొక్కలాంటి ఒక రకం సముద్రపు నాచు) సాగుపై ఆసక్తి పెరుగుతోంది. ఇందుకు విశాఖ సాగర తీరం ఎంతో అనుకూలంగా ఉంది. మారుతున్న జీవన శైలి, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యంలో సీ–వీడ్, దీని ఆధారిత ఆహార ఉత్పత్తులపై ప్రజలకు మక్కువ అధికమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (ఐఎఆర్ఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)లు ఈ సీ–వీడ్ సాగును ప్రోత్సహిస్తున్నాయి. సీ–వీడ్‌తో విభిన్న ఆహార ఉత్పత్తుల తయారీపై ఆసక్తిని, వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారిస్తున్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే సీ–వీడ్‌తో సూప్‌లు, నూడుల్స్, పాస్తాల్లో పొడి, రోల్ రూపంలో తినడానికి వీలుగా తయారు చేస్తున్నారు. ఇంకా బిస్కెట్లు, కుకీస్, న్యూట్రియెంట్ బార్స్, బ్రెడ్లు, సాచెట్లు వంటివి తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. సీ–వీడ్‌తో తినే పదార్థాలు, సూప్, సాచెట్లు వంటివి తయారుకు అవసరమైన సాంకేతికతను విశాఖలోని ఐకార్–సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

ఉమ్మడి విశాఖలో అనుకూల ప్రాంతాలు

ఆంధ్రప్రదేశ్‌లో 49 ప్రాంతాల్లో తీరానికి ఆనుకుని సముద్రంలో 1,215 హెక్టార్లు సీ–వీడ్ పెంపకానికి అనువైన ప్రాంతం ఉన్నట్టు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆర్కే బీచ్ వద్ద 40 హెక్టార్లు, వుడా పార్క్ 10, తెన్నేటి పార్క్ 50, తొట్లకొండ 25, భీమిలి 25, తిమ్మాపురం 50, మంగమారిపేట 50, ఎండాడ 25, ముత్యాలమ్మపాలెం 25, పూడిమడక 50, బంగారమ్మపాలెం 25, రాంబిల్లి ప్రాంతంలో 25 వెరసి 400 హెక్టార్లు అనుకూలంగా ఉందని తేల్చారు.

మంగమారిపేటలో పైలట్ ప్రాజెక్టు

సీ–వీడ్ సముద్రంలో సహజ సిద్ధంగానే పెరుగుతుంది. ఇప్పుడు దీనిని కృత్రిమంగానూ పెంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద భీమిలి మండలం మంగమారిపేటను సీ–వీడ్ సాగు కోసం ఎంపిక చేశారు. సీఎంఎఫ్ఆర్ఐ నేతృత్వంలో అక్కడ రాఫ్ట్ మోడల్‌లో కప్పాఫాగస్ అనే రకం సీ–వీడ్‌ను సాగు చేయనున్నారు. సముద్రతీరానికి 250–300 మీటర్ల దూరంలో కెరటాల ఉధృతి తక్కువగా ఉన్న ప్రాంతంలో సీ–వీడ్ సాగుకు అనువుగా ఉంటుంది. అక్కడ వెదురుకర్రలతో మంచాల మాదిరిగా సముద్రంపై తేలియాడేలా రాఫ్ట్‌లను నిర్మిస్తారు. అవి కెరటాలకు కొట్టుకుపోకుండా దిగువన సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి వాటిని గొలుసులతో కడ్తారు.

2,700 యూనిట్ల మంజూరు

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు 2,700 సీ–వీడ్ యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి కనీసం 10 యూనిట్లు కేటాయించవచ్చు. ఒక్కో యూనిట్ విలువ రూ.1,500 ఉంటుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. ఒకసారి వేసిన సీ–వీడ్ 40–45 రోజుల్లో కోతకు వస్తుంది. పది కిలోల సీ–వీడ్ విత్తనం వేస్తే వంద కిలోల దిగుబడినిస్తుంది. అనంతరం దానిని పది రోజుల పాటు ఎండబెట్టాల్సి ఉంటుంది. పది కిలోల పచ్చి సీ–వీడ్ ఎండాక మూడు కిలోలకు తగ్గుతుంది. ప్రస్తుత మార్కెట్లో కిలో సీ–వీడ్ ధర రూ.వెయ్యి వరకు ఉంది. ఇలా ఏడాదిలో వర్షాకాలం 2–3 నెలలు మినహా మిగతా కాలమంతా సీ–వీడ్ సాగుకు అనుకూలమే.

సీ–వీడ్‌తో ప్రయోజనాలివీ..

సీ–వీడ్‌లో తినడానికి వీలయ్యే 221 రకాల జాతులున్నాయి. వీటిలో సోడియం, కాల్షియం, క్లోరిన్, మెగ్నీషియంలతో పాటు ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఫోలిక్ యాసిడ్లు, తక్కువ కొవ్వు, కేలరీలు ఉంటాయి. సీ–వీడ్‌తో తయారైన ఆహార పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, హెచ్ఐవీ, కోవిడ్ వంటివి నియంత్రణలోకి వస్తాయని సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నెల రోజుల్లో సాగుకు శ్రీకారం



సీ–వీడ్ సాగుపై అసక్తి ఉన్న వారికి అవగాహన కల్పిస్తున్నాం. దీని సాగు విధానం, వచ్చే ఆదాయం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీల సాంకేతిక సహకారాన్ని వివరిస్తున్నాం. మంగమారిపేట తీరంలో మరో నెల రోజుల్లో సీ–వీడ్ సాగుకు శ్రీకారం చుడతాం. మలిదశలో భీమిలి తీరంలో దీని సాగు చేపట్టాలని యోచిస్తున్నాం. – పి.కృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, పీఎంఎంఎస్‌వై

సీ-వీడ్ పెంపకం లాభదాయకం



సముద్రంలో సీ–వీడ్ పెంపకం లాభదాయకంగా ఉంటుంది. వీటి పెంపకానికి ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుంది. మత్స్యకారులతో పాటు ఇతర వర్గాలు కూడా ఈ యూనిట్ల మంజూరుకు అర్హులే. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలి.

–జి.విజయ, జిల్లా మత్స్యశాఖ అధికారి, విశాఖ

24న 'కథ వెనుక కథ' చిత్రం విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న గొట్టిపాటి సాయి

డాబాగార్డెన్స్: దండమూడి బాక్స్ ఆఫీస్ పతాకంపై దండమూడి అవనీంద్రకుమార్ నూతనంగా నిర్మించిన 'కథ వెనుక కథ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆదివారం విశాఖలో సందడి చేసింది. మీడియా సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ కథ వెనుక కథ చిత్రం ఆద్యంతం అందర్నీ ఆకట్టుకునే సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించామన్నారు. ఇందులో రెండు పాటలు ఉంటాయని, ఒకటి గోవాలో, ఐటెమ్ సాంగ్ హైదరాబాద్‌లో చిత్రీకరించామన్నారు. సెంటిమెంట్‌గా తనను ఈ స్థాయికి తీసుకు వచ్చింది వైజాగేనని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చిత్ర హీరో (ఓ పిట్ట కథ ఫేమ్) విశ్వంత్ మాట్లాడుతూ తన కెరీర్‌లో ఈ చిత్రం ఓ మైలురాయిలా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్నప్పుడు విశాఖలోనే చదువుకున్నానని చెప్పారు. చిత్ర దర్శకుడు కృష్ణచైతన్య, హీరోయిన్లు శ్రీజిత ఘోష్, శుభశ్రీ, ప్రముఖ కమెడియన్ మధునందన్ మాట్లాడుతూ తమను ఆదరించి, సినిమా విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి జైలుల్లో నేషనల్ కాన్ఫరెన్స్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 'స్టేక్ హోల్డర్స్ కోఆర్డినేషన్ అండ్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' అనే అంశంపై కాన్ఫరెన్స్ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ, మేఘాలయ, కర్నాటక, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

తాటాకిల్లు దగ్ధం..

రూ.లక్ష ఆస్తి నష్టం



నిరాశ్రయులైన కామరాజు కుటుంబం

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ, కొత్తవీధి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటనలో బోనెం కామరాజు ఇంట్లో వంట సామగ్రి, దుస్తులు, భూమి డాక్యుమెంట్లు, రూ.50 వేల నగదు, ఫర్నిచర్ బూడిదయ్యాయి. విద్యుత్ వైర్ల నుంచి ఎగసిన నిప్పురవ్వలే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇంటి యజమాని కామరాజు, భార్య, చంటి బిడ్డతో కలిసి జీడిమామిడి తోట కాపలాకు వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. మంటలను ఆర్పేందుకు చుట్టుపక్కల వారు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కామరాజు శ్రీశైలంలో చెరకు నరుకు పనులకు వెళ్లి ఇటీవల స్వగ్రామం వచ్చాడు. అక్కడి నుంచి తీసుకువచ్చిన కూలి సొమ్ము రూ.25వేలు, అడ్వాన్స్‌గా తెచ్చిన మరో రూ.25వేల నగదును బీరువాలో భద్రపరచాడు. అగ్ని ప్రమాదంలో నగదు, డాక్యుమెంట్లతోపాటు సర్వస్వం బూడిద కావడంతో కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కామరాజు కోరాడు.

నిండు గర్భిణికి కష్టాలు

అటవీ మార్గాన డోలీలో తరలింపు



రాచకీలం-రెడ్డిపాడు గ్రామాలకు గిరిజనులు శ్రమదానంతో నిర్మించుకుంటున్న రహదారి (ఫైల్)

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన నిండు గర్భిణి సుకూరు లక్ష్మి (20)ని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్తులు, కుటుంబసభ్యులు నానా అవస్థలు పడ్డారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు రాచకీలం గ్రామం నుంచి గుమ్మంతి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఆమెను అటవీమార్గంలో డోలీలో మోసుకొని గుమ్మంతి వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం గర్భిణిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ గ్రామానికి శ్రమదానంతో రహదారితో నిర్మించుకుంటుండంతో అనుమతులు లేవంటూ అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో పనులు నిలిచిపోయాయి. అయితే ఈ రోడ్డు నిర్మాణం పూర్తయి ఉంటే గ్రామానికి 108 వాహనం వచ్చే అవకాశం ఉండేదని గిరిజనులు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు.

శ్రీవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నేడు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకు సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకు తోమాల సహస్ర నామార్చన, మొదటి గంట నిర్వహించనున్నారు. 7 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి 12.45 వరకు 2వ గంట, 12.45 నుంచి సాయంత్రం 6 గంట వరకు సర్వదర్శనం, సాయంత్రం 6.45 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం కల్పించనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం జరగనుంది. శ్రీవారి ఆలయంలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని ఆలయ ఏఈవో రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ఏయూ, అనుబంధ కళాశాలలకు సెలవు

ఏయూక్యాంపస్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల్లో పెద్దసంఖ్యలో పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. వీరంతా తమ స్వస్థలాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

నేటి నుంచి ఫీవర్ సర్వే

మహారాణిపేట: కొత్త రకం ఫ్లూ హెచ్3ఎన్2 వ్యాపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సోమవారం నుంచి ఫీవర్ సర్వే చేపట్టనుంది. వలంటీర్ల సహకారంతో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. ఈ సర్వే వారం రోజుల పాటు సాగనుంది. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించనున్నారు. జ్వర పీడితుల నుంచి రక్తం శాంపిల్స్ సేకరించి కేజీహెచ్‌లో ఉన్న వైరల్ ల్యాబ్‌లో పరీక్షలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి వచ్చిన ఫలితం ఆధారంగా వాటిని తిరుపతి లేదా పుణే ల్యాబ్‌లకు పంపుతామని డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 909 మంది ఆశా కార్యకర్తలు, 542 మంది ఏఎన్ఎంలు ఈ సర్వేలో పాల్గొంటున్నారు.

లక్ష్మీపురంలో అగ్ని ప్రమాదం



ఎగసిపడుతున్న మంటలు (ఇన్‌సెట్) మంటలు అదుపుచేస్తున్న సిబ్బంది

- రూ.1.5 లక్షల ఆస్తి నష్టం

చోడవరం రూరల్ : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు లక్షా ఏభైవేల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామంలోని గొల్లవిల్లి వారి కళ్లాలు వద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కరణం సత్యనారాయణకు చెందిన పశువుల పాక, కోన నర్సింగరావుకు చెందిన వరికుప్పలు, గడ్డివాము దగ్ధమయ్యాయి. మంటలు ఎగసిపడేలోగా చుట్టుపక్కలవారు కళ్లాల వద్ద ఉన్న పశువులను సురక్షితంగా వేరే చోటికి తరలించడంతో పాడిపశువులకు ముప్పు తప్పింది. ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల ఉన్న గడ్డివాములు, వరికుప్పలను అక్కడి నుంచి తొలగించి ప్రమాద నష్ట తీవ్రతను తగ్గించారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఓవరాల్ చాంపియన్ అనకాపల్లి


అమలాపురంలో ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన అనకాపల్లి క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సభా వేదికపై జరుగుతున్న 10వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్, జూనియర్ మెన్, వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. శని, ఆదివారాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మెన్ పవర్ లిఫ్టర్లు 150 మంది, వుమెన్ పవర్ లిఫ్టర్లు 70 మంది మొత్తం 220 మంది తలపడ్డారు. వారు పలు కేటగిరీల్లో బరువులు ఎత్తి తమ సత్తా చాటారు. ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు సంబంధించి రెండో రోజు కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, విశ్రాంత ఐపీఎస్ సుందర్ కుమార్ దాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు పతకాలు అందించారు. బెంచ్ ప్రెస్, స్కాట్, డెడ్ లిఫ్ట్, మాస్టర్స్ కేటగిరీల్లో 47 కేజీల నుంచి 83 కేజీల బరువులు ఎత్తి సత్తా చాటారు. ఒక్కో పవర్ లిఫ్టర్ 90 కేజీల నుంచి 600 కేజీల వరకూ బరువులు ఎత్తి పతకాలు పట్టారు. పవర్ లిఫ్టింగ్‌లో 48, బెంచ్ ప్రెస్‌లో 24, డెడ్ లిఫ్ట్‌లో 24, మాస్టర్స్‌లో 24 ఇలా మొత్తం మూడు నాలుగు కేటగిరీలకు సంబంధించి 120 స్వర్ణ, రజత, కాంస్య పతకాలు విజేతలకు అందించారు. అనకాపల్లి క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్ నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కోటేశ్వరరావు, చాంపియన్ షిప్ డైరెక్టర్ మట్టపర్తి వి.సముద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని బహుమతులు అందజేశారు.

కోనసీమ ప్రత్యేకతను చాటారు



ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీలకు వచ్చిన పవర్ లిఫ్టర్లకు కోనసీమ ప్రత్యేకతను చాటేలా వసతి, ఆహారం అందించి గౌరవంగా చూసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 220 మంది పవర్ లిఫ్టర్లను ఓ క్రీడాకారులుగా కాకుండా ఓ అతిథులుగా గౌరవించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు మా క్రీడాకారుల తరుపున కృతజ్ఞతలు.

– కె.నరసింహారావు, పవర్ లిఫ్టర్, గుంటూరు జిల్లా